విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 08, జనవరి 2025

మద్దతు ధరకు కొనుగోలు చేస్తుంది

విశాలాంధ్ర - బనగానపల్లె: కంది పంటను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి తెలిపారు. మండల పరిధిలో పసుపుల మరియు పాతపాడు గ్రామా లను పొలం పిలుస్తుంది కార్యక్రమం లో పాల్గొన్నారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా కంది వేసిన రైతు సోదరులందరినీ ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుందని దయచేసి కంది పంటను ఆయా రైతు సేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవాల్సిందిగా, కనీస మద్దత్తు ద్దరైనటువంటి రూ 7550 అమ్ముకోవాలని రైతులకు తెలిపారు. మొక్కజొన్న పంటలో రబీలో తీసుకోవాల్సిన రసాయనిక ఎరువుల, పురుగుమందుల యజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు.

ఫ్యామిలీ పింఛన్‌లపై విచారణ : ఎంపీడీవో

విశాలాంధ్ర - శిరివెళ్ల : మండల పరిధిలోని ఆయా గ్రామాలలో లబ్ధి పొందుతున్న ఫ్యామిలీ పింఛన్‌ల వివరాలపై ఫిబ్రవరి మూడు నాలుగు తేదీలలో విచారణ జరగనున్నట్లు ఎంపీడీవో సి.శివ మల్లేశ్వరప్ప తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరుపున15 వేల పెన్షన్ పొందుతున్నటువంటి ఫ్యామిలీ పెన్షన్దారుల అర్హత అనర్హత వివరాలను నమోదు చేసేందుకు ఇతర జిల్లాల నుండి వైద్య బృందం తో పాటు అధికారులు రాబోతున్నారని ఎంపీడీవో తెలిపారు. శిరివెళ్ల మండల వ్యాప్తంగా 56 ఫ్యామిలీ పెన్షన్లు ఉన్నాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. దివ్యాంగుల పింఛన్‌లు, ఇతర సామాజిక పింఛన్‌లపై విచారణ ప్రభుత్వం తేదీలను ప్రకటించాల్సి ఉందని అన్నారు.

రేపు జరిగే సర్వసభ్య సమావేశానికి అధికారులు తప్పక హాజరు కావాలి

విశాలాంధ్ర - ఉయ్యాలవాడ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం నాడు ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఉమామహేశ్వరావు తెలిపారు. ఈ సమావేశం ఉదయం 10 గంటలకు ప్రారంభమవు తుందని, ఈ సమావేశానికి సర్పంచులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

సీఎంను కలిసిన గోగిశెట్టి నరసింహారావు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయన కార్యాలయంలో శిరివెళ్ల మండలం వీరారెడ్డి పల్లె గ్రామ వాస్తవ్యులు, రాష్ట్ర టిడిపి కార్యదర్శి గోగిశెట్టి నరసింహారావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి గోగిశెట్టి నరసింహారావు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు.

సీనియర్ పాత్రికేయుడు రవి మృతికి సీపీఐ జిల్లాసమితి సంతాపం

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : పట్టణానికి చెందిన సీనియర్ పాత్రికే యులు రవి అకస్మికంగా మృతి చెందడం బాధాకరమని, ఆయన మృతి పట్ల సిపిఐ జిల్లా సమితి తరపున సంతాపం తెలియజేస్తూ వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ బాబా ఫక్రుద్దీన్‌లు తెలిపారు.

సబ్ రిజిస్టర్ నాయక్ అబ్దుల్ సత్తార్ సస్పెన్షన్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: నంద్యాల సబ్ రిజిస్టర్ నాయక్ అబ్దుల్ సత్తార్ ను కర్నూల్ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ సస్పెండ్ చేశారు. కోర్టులో స్టే ఉన్న ఒక ఆస్తి తాలూకు రిజిస్ట్రేషన్ ను నంద్యాలలో రిజిస్ట్రేషన్ చేయడంతో ఆస్తి తాలూకా వ్యక్తుల ఫిర్యాదు మేరకు కర్నూలు రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డీఐజీ సోమవారం సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెన్షన్ ఉన్నంత వరకు హెడ్ క్వార్టర్స్ వదిలి బయటికి వెళ్లరాదని ఆదేశించారు.

విద్యా కమిటీ వైస్ చైర్మన్ గుండెపోటుతో మృతి

విశాలాంధ్ర - కోవెలకుంట్ల: మండల పరిధిలోని రేవనూరు గ్రామానికి చెందిన తలారి హుస్సేన్ నాయుడు (32) మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే రేవనూరు గ్రామంలోని మాగం వారి హై స్కూల్‌లో విద్యా కమిటీ వైస్ చైర్మన్‌గా తలారి హుస్సేన్ నాయుడు పని చేసేవాడు. మృతునికి భార్య, కొడుకు, కూతురు ఉన్నారు. ఈయన టీడీపీకి సేవలు అందించారు.

సైబర్ భద్రతను నిర్ధారించడం అత్యంత కీలకం

విశాలాంధ్ర -పాణ్యం: వేగవంతమైన డిజిటల్ మార్పుల యుగంలో సైబర్ భద్రతను నిర్ధారించడం అత్యంత కీలకమని సావరి మైండ్స్ సీఈవో అమిత్ కుమార్ అన్నారు. శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం సిఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో సైబర్ సెక్యూరిటీ అంశంపై అవగాహన సదస్సు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన భద్రమైన డిజిటల్ వాతావరణాన్ని ప్రోత్సహించే దిశగా ఈ సదస్సు ప్రారంభించినట్లు తెలిపారు. 25 రోజులపాటు జరిగే ఈ సదస్సులో సైబర్ ముప్పులను గుర్తించడం, రిస్క్ మేనేజ్మెంట్ డేటా రక్షణ, సైబర్ సెక్యూరిటీలో కొత్తగా వస్తున్న సాంకేతికత వంటి విభిన్న అంశాలను కవర్ చేస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ లక్ష్మీ చైతన్య, హెచ్ఓడిఎస్ఎండి ఫరూక్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సన్నిధిలో పూజలు

విశాలాంధ్ర -పాణ్యం: మండల పరిధిలోని ఎస్.కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధిలో మంగళవారం స్థానిక తహసిల్దార్ నరేంద్రనాథ్ రెడ్డి దంపతులు, కర్నూలు సిఐడి సీఐ అశోక్ దంపతులు స్వామివారిని దర్శించుకోవడం జరిగింది. ముందుగా ఆలయ మర్యాదలతో ఈవో రామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు నారాయణస్వామి, కిట్టయ్య స్వామి వారికి స్వాగతం పలకడం జరిగింది. వారు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, నాగలింగేశ్వర స్వామికి పలు విశేష పూజలు, అర్చనలు,పంచామృతాభిషేకములు నిర్వహిం చడం జరిగింది. అనంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వారిని శాలువాతో పూలమాలతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదములు అందజేయడం జరిగింది. కార్యక్రమంలో అర్చకులు రోహిత్ స్వామి, సిబ్బంది నాగేశ్వరరావు, వీఆర్వో, వీఆర్ఏ ప్రసాద్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపట్ల అవగాహన ఉండాలి

విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లె ఏపీ మోడల్ జూనియర్ కళాశాల నందు రిజర్వ్ బ్యాంక్ అఫ్ ఇండియా, డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నెస్ వర్క్ షాప్ కు ముఖ్య అతిథిగా బనగానపల్లె సర్కిల్ ఇన్స్పెక్టర్ కే ప్రవీణ్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులందరూ కూడా సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి అని ఎవరైనా వ్యక్తి మీకు కాల్ చేసి మీ వ్యక్తిగత వివరాలు అడిగిన మరియు ఓటీపీ, పిన్, సీవీపీ లాంటివి చెప్పకూడదన్నారు. ప్రతి విద్యార్థి ఆర్థిక క్రమశిక్షణ పాటించి జీవితంలో ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని తెలిపారు. ఏపీ జీబి బ్యాంకు మేనేజర్ మద్దిలేటి, కెనరా బ్యాంకు మేనేజర్ అంకన్నలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాటం ఆగదు : ఏఐటీయూసీ

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌ను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించే వరకు పోరాటం ఆగదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుంకయ్య, అంగన్వాడి వర్కర్స్ అసోసియే షన్ జిల్లా అధ్యక్షురాలు వసుంధర దేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రకళ, ఏఐటియుసి నంద్యాల పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డి.శ్రీనివాసులు, భూమన శ్రీని వాసులు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఏఐటియుసి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్, ఏఐటీయూసీ జాతీయ సమితి పిలుపు మేరకు నల్ల బ్యాడ్జీలతో నిరసన ప్రదర్శన, ధర్నా నిర్వ హించారు. ఈ ధర్నాకు వసుంధరదేవి అధ్యక్ష వహించారు. ధర్నానుద్దేశించి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుంకయ్య మాట్లాడుతూ గత ఎన్నికల కన్నా ముందు రాష్ట్రంలో ఉన్న అంగన్వాడి వర్కర్స్ లక్ష మందికి పైగా రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చి 42 రోజులుగా సమ్మె నిర్వహించారని, అప్పుడు అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం అంగన్వాడి వర్కర్ల వేతనాలు పెంచకుండా సమ్మె చేసినందుకు పోలీసులతో బెదిరించి కేసులు పెట్టి నిర్బంధించి, అనేక ఇబ్బందులకు గురిచేసి ఒక్క రూపాయి వేతనం పెంచలేదని ఆరోపించారు. ఆ సందర్భంలో ఎన్నికల బహిరంగ సభలో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నేను అధికారంలోకి వస్తే అంగన్వాడి వర్కర్స్ కు వేత నాలు పెంచడంతో పాటు అన్ని రకాలుగా ఆదుకుం టానని హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి వచ్చి 5 నెలలు దాటినా సంబంధిత మంత్రులు, రాష్ట్ర స్థాయి అధికారులను కలిసి విన్నవించినా అంగన్వాడి వర్కర్ల సమస్యల పట్ల పూర్తి నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిం చారు. తెలంగాణలో మాదిరి 18 వేల వేతనం పెంచా లని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. వెంకట సుబ్బమ్మ, ఇందు, సునీత, సుజాత అధిక సంఖ్యలో వర్కర్స్ పాల్గొన్నారు.

నాపరాతి గనులపై విజిలెన్స్ అధికారుల దాడులు

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని బెలుం గ్రామ సమీపంలో నాపరాతి గనులపై విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ మైనింగ్ నిర్వహిస్తుండడంతోనే విజిలెన్స్ అధికారులు దాడులు చేసి నాప రాతి గనులలోని కోత మిషన్లను స్వాధీనం చేసుకున్నట్లు సమా చారం. గత కొన్ని నెలలుగా నాపరాతి గనులపై అధికారులు దాడులు నిర్వహిస్తుండడంతో కల కలం రేగుతున్నది. కొందరి నాపరాతి గనుల యజమానులే లక్ష్యంగా అధికారులు దాడులు చేస్తున్నట్లు ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. విజిలెన్స్ అధికారులు నాపరాతి గనులలోకి వచ్చారన్న సమా చారంతోనే గనులలో పనిచేస్తున్న కూలీలు, కార్మికులు అక్కడి నుండి వెళ్లిపోయారు. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ నిర్వహిస్తుండ దంతోనే అధికారులు దాడులు చేస్తున్నట్లు కూడా ప్రజలు చర్చించు కుంటున్నారు. ఏదేమైనా నాపరాతి పరిశ్రమ పీకలలోతు నష్టాల బాటలో ఉన్నది. విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న కోత మిషన్లను స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-డోన్: అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌ను, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జాతీయ పిలుపుమేరకు మంగళవారం నల్లబ్యాడ్జీలతో డోన్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ఏఐటీయూసీ నియోజవర్గ కార్యదర్శి అబ్బాస్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ డోన్ నియోజవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, అబ్బాస్, అంగన్వాడి జిల్లా కార్యదర్శి జులేఖ, జిల్లా ట్రెజరర్ ఎస్తేరమ్మ వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రంలో ఉన్న అంగన్వాడి వర్కర్స్ లక్ష మందికి పైగా రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చి 42 రోజులుగా సమ్మె నిర్వహించడం జరిగింద న్నారు. అప్పుడు అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం అంగన్వాడి వర్కర్లను వేతనాలు పెంచకుండా సమ్మె చేసినందుకు పోలీసులతో బెదిరించి కేసులు పెట్టి, పోలీసులు పెట్టి నిర్బంధించి అనేక ఇబ్బందులకు గురిచేసి ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేద న్నారు. ఆ సందర్భంలో ఎన్నికల బహిరంగ సభలో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు మాట్లాడుతూ నేను అధికారం లోకి వస్తే అంగన్వాడి వర్కర్స్ కు వేతనాలు పెంచడంతోపాటు అన్ని రకాలుగా ఆదుకుం టానని హామీ ఇచ్చారన్నారు. కానీ నేడు అధికారంలోకి వచ్చి 5 నెలలు దాటిన సంబం ధిత మంత్రులను రాష్ట్ర స్థాయి అధికారులను కలిసి విన్నవించిన అంగన్వాడి వర్కర్ల సమస్యల పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ డోన్ నియోజకవర్గ కార్యదర్శి స్వర్ణలత, నాయకురాలు జయలక్ష్మి, సుగుణ, విజయలక్ష్మి, ధనలక్ష్మి, నాగేంద్రమ్మ, రమణమ్మ, నిర్మల, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర - మహానంది : మండలం అబ్బీపురం చెంచు గిరిజన కాలనీలో సంక్రాంతి పండుగ సందర్భంగా ఈ నెల 11వ తేదీ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో జరుగు ముగ్గుల పోటీలను జయప్రదం చేయాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. సీపీఐ 1925 కాన్పూర్ నగరంలో ఆవిర్భావించి, 2025 నాటికి వంద సంవత్సరాలు పూర్తయిందన్నారు. అబ్బీపురం గిరిజన కాలనీలో జరుగు ముగ్గులు పోటీలకు ముఖ్య అతిధులుగా సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్. అబ్బీ పురం గ్రామ సర్పంచ్ శ్రీలక్ష్మి, కెసి కెనాల్ అధ్యక్షులు బన్నూరు రామలింగారెడ్డి, మండల టీడీపీ నాయకులను హాజరవుతారని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న, సీపీఐ మండల కార్యదర్శి ఆర్.సామేలు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి బి.గురుమూర్తి, నాయకులు దస్తగిరి, వలి పాల్గొన్నారు.

సిద్దేశ్వర స్వామి రాజ గోపురానికి విరాళం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల : కోవెలకుంట్లలోని సిద్దేశ్వర దేవాలయ రాజ గోపురానికి రూ.6.75 లక్షలు విరాళం అందజేస్తున్నట్లు టిడిపి కార్య దర్శిగడ్డం రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఆలయ ధర్మకర్త గుద్దేటి రామకృష్ణారెడ్డికి దాతలు చెక్కును అందజేశారు. ఈ సందర్భం గా గడ్డం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆలయ రాజ గోపురానికి గుద్దేటి రామకృష్ణారెడ్డి, గుద్దేటి నరసింహారెడ్డి, రామలింగమ్మ, అందేలా లక్ష్మీ ప్రసన్న దాతలు అందరు కలిసి ఆలయ ధర్మకర్తకు చెక్కు అందజే శామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు రాముస్వామి, గువ్వల రామకృష్ణారెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, శివ శంకర్ రెడ్డి, గడ్డం అమర్నాథ్ రెడీ తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన ప్రజ్ఞ విద్యార్థి

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ: స్థానిక ప్రజ్ఞ డిగ్రీ కళాశాలలో బికాం మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి గురుతేజ జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల విశాఖపట్నం నున పర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో గురు తేజ మంచి ప్రతిభ కనబరిచి మహారాష్ట్రలోని నాగ్ పూర్ నందు జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థి గురుతేజను కళాశాల గౌరవాధ్యక్షులు నరసింహారెడ్డి, చైర్ పర్సన్ హేమలత రెడ్డి, ప్రిన్సిపాల్ శివరామిరెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బాబు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి సందర్భంగా క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర-అవుకు: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని అవుకు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్లు సుజీత్ బాష, రామ చంద్రుడు, శేఖర్‌లు తెలిపారు. వారు మాట్లాడుతూ అవుకు జడ్పీటిసి చల్లా శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా 10వ తేదీ నుండి క్రికెట్ పోటీలు నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండవ బహుమతిగా రూ.5 వేలు, మూడవ బహుమతిగా రూ.2 వేలను అందించనున్నట్లు తెలిపారు. పోటీలో పాల్గొనదలచిన వారు 9వ తేదీ సాయంత్రం ఆరు గంటల లోపు పేరు నమోదు చేసుకోవాలని అన్నారు. ఎంట్రీ ఫీజు 500, బాల్ ఫీజు వంద రూపాయలు ఉంటుందని, అంపైర్లదే తుది నిర్ణయమ న్నారు. ఆసక్తి గలవారు పేరు నమోదు చేసుకోవాలని అన్నారు.

పోలీస్ నిఘా నీడలో అంగన్‌వాడీ ఆయాపై విచారణ..

విశాలాంధ్ర - కొలిమిగుండ్ల: మండలంలోని అబ్దుల్లాపురంలో అంగ న్వాడీ కేంద్రం ఆయాపై వచ్చిన ఆరోపణలపై ఐసిడిఎస్ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. అంగన్వాడి ఆయాగా డి.హుస్సేన్ బీ రెండు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్నది. ఆయాపై కొందరు లబ్ధిదారులు ఐసిడిఎస్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో బనగానపల్లి సిడిపిఓ ఆధ్వర్యంలో గ్రామంలో విచారణ చేశారు. ఉదయం నుండి రాత్రి వరకు పోలీస్ నీడలో అంగనవాడి కేంద్రం లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి సమగ్రంగా వివరాలు సేకరించారు. అంగన్వాడి కేంద్రానికి సంబంధించి చిన్నారులు, బాలింతలు, గర్భిణీలకు అందజేయవలసిన కోడిగుడ్లు కందిబేళ్లు నూనె తదితర పౌష్టికాహారాన్ని సరిగ్గా అందచేక ఆయా అక్రమాలు చేస్తున్నట్టు ఫిర్యాదులు వెళ్లడంతో అధికారులు విచారణ చేపట్టారు. ప్రతి లబ్ధిదారుని ఇంటికి వెళ్లి వివరాలు సేకరించడంతో రాత్రి 8 గంటల వరకు కొనసాగింది.

ఇస్తేమా ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర - ఆత్మకూరు రూరల్ : పట్ట ణంలో ఇస్తేమా జరుగుతున్న సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేయడం జరి గింది. జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా పార్కింగ్ ప్రదేశాలు, కంట్రోల్ రూమ్, సభాస్థలి మొదలగు ముఖ్యమైన ప్రాంతాలను స్వయంగా సందర్శించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. భద్రత ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఆత్మకూరు డిఎస్పీ రామంజి నాయక్, సీఐలు రాము, సురేష్ కుమార్ రెడ్డి, ఇస్తేమా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో...

తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి ఫరూక్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జనాభా ప్రాతిపదిక మేరకు నంద్యాల అర్బన్ మండల తహశీల్దార్ కార్యాల యాన్ని సత్వర రెవెన్యూ సర్వీసుల సౌలభ్యం కొరకు రెండు భాగాలుగా విభజించి రూరల్ మండల తహ శీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. మంగళవారం స్థానిక అర్బన్ తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటైన రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ ఎండి ఫారుక్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రమైన తర్వాత జనాభా అధికమైన నేపథ్యంలో రూరల్, అర్బన్ మండలాలుగా విభజించి ప్రజలకు రెవెన్యూ సర్వీసులను సరళీతరం చేసేందుకు రూరల్ తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మా ణం చేపట్టి అన్ని కార్యాలయాలు ఒకే ప్రదేశానికి తీసుకువచ్చి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల మండలంలో 20 రెవెన్యూ గ్రామాలున్నాయని, భూ సంబంధిత దరఖాస్తులు, ఇతర సర్వీసులకు సంబంధించిన అంశాలు అధికంగా ఉన్న నేపథ్యంలో నంద్యాల రూరల్ మండల ఏర్పాటుకు నిమిత్తం ప్రభుత్వం అంగీకరించిందన్నారు. అనంతరం మండల కార్యాలయ ఆవరణలో మంత్రి, కలెక్టర్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంక్ ఉద్యోగాల్లో సత్తా చాటిన శ్రీ గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: పట్టణంలో ఉన్న శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ మరోసారి రాష్ట్ర స్థాయిలో తన సత్తాను చాటింది. గ్రామీణ బ్యాంకు రంగంలో 272 ఉద్యోగాల్లో సాధించి అగ్రగామిగా నిలిచినట్లు శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ చైర్మన్ డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి, డైరెక్టర్ పి.మౌలాలిరెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. గ్రామీణ బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి, పి.మౌలాలి రెడ్డి మాట్లాడుతూ 2024 గ్రామీణ బ్యాంకుల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో తమ బ్యాంక్ కోచింగ్ సెంటర్ నుంచి అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారికి అత్యుత్తమ శిక్షణతో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. మొత్తం 272మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారని తమ గురు రాఘవేంద్ర బ్యాంకు కోచింగ్ సెంటర్‌కు ఇది ఎంతో గర్వకారణంగా అభివర్ణించారు. ఐబీపీఎస్ ఆర్ఆర్బి పీఓలో 151, ఐబీపీఎస్ ఆర్ఆర్బి క్లర్క్ లో 121 ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. సరళమైన భాషలో బోధిస్తూ ఉద్యోగాలు పొందేలా చూడడమే తమ లక్ష్యం అని చెప్పారు. 35 ఏళ్లుగా బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ స్థాపించి ఎంతోమంది అభ్యర్థులు ఉద్యోగాలు పొందేలా శిక్షణ ఇచ్చామన్నారు.

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వండి

విశాలాంధ్ర - వెలుగోడు: మండలం మోత్కూరు, మాధవరం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం క్షేత్రస్థాయిలో మినుము, మొక్కజొన్న పైరును పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రబీలో సాగుచేసిన వివిధ పంటలు ఈ-పంట నందు నమోదు చేసుకోవాలని, పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంట వాతావరణ పరిస్థితుల్లో ఇన్పుట్ సబ్సిడీ పంట కొనుగోలు మరే ఇతర ప్రభుత్వ సబ్సిడీలు వర్తిస్తాయి.మినుము పంటలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి. ఈ కార్యక్రమంలో ఏఈఓ సుధారాణి వ్యవసాయ విస్తరణ సిబ్బంది నాగలింగం పలువురు రైతులు పాల్గొన్నారు. వెలుగోడు పట్టణంలోని స్థానిక స్టేట్ బ్యాంకు, ఏపీజీబీ, కెనరా, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ లను కలిసి కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని వెలుగోడు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, నంద్యాల జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రవీంద్ర కోరారు. వ్యవసాయ విస్తరణ సిబ్బంది అంజిత్ కుమార్ రెడ్డి, రామకృష్ణ, వెంకట శివ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు తీర్చడానికే పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - చాగలమర్రి : రైతుల సమస్యలు తీర్చడానికే 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ను నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రంగనేతాజీ తెలిపారు. మంగళవారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్లో అధిక చలి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి దీని ప్రభావం వలన శనగ పంటలో పూత రాలే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈఓలు, గ్రామ వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

స్కీమ్ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర - నంది కొట్కూరు : దేశవ్యాప్తంగా ప్రభుత్వ సంక్షేమ పద కాలు ప్రజలకు చేర దీయడంలో కీలక పాత్ర వహిస్తున్న అంగన్వాడి, ఆశా, మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల వేత నాలు సుప్రీం కోర్ట్ ఆదే శాల మేరకు కనీస వేతనం రూ.26 వేలు పెంపుదల చేయాలనీ స్కీం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వి.రఘురామ్మూర్తి కోరారు. మంగళవారం పట్టణంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు రాణి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్కిం వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకట రమణ, కమల, కాత్యాయనీ, రాణి, లక్ష్మి, పుణ్యవతి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చేంతవరకు పోరాటాలు చేస్తాం



విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: ఇళ్ల స్థలాల సాధనకై ఈనెల 10వ తేదీన తహసిల్దార్ కార్యా లయం ఎదుట నిర్వహిం చే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, ఏఐ ఎస్ఎఫ్ ఏఐ వైఎఫ్ జిల్లా కార్యదర్శులు ధనుంజయుడు పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్, ట్రాలీ ఆటో యూనియన్ సిపిఐ శాఖలలో మంగళవారం నిరు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఇండ్లులేని నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు తక్షణమే ఇవ్వాలని ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షలు ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సురేష్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రిస్వామి, ఏఐవైఎఫ్ నంద్యాల పట్టణ కార్యదర్శి విష్ణులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఉచిత గుండె పరీక్షలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : స్థానిక కోర్టు సముదాయంలో కర్నూలు కిమ్స్ ఆస్పత్రి, ది అడ్వకేట్ బార్ అసోసియేషన్ వారి సౌజన్యంతో, ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని మంగళవారం సీనియర్ సివిల్ జడ్జి శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయవాదులకు ఉచితంగా ఈసీజీ, టుడి ఏకో, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తులు కాశీభట్ల శివప్రసాదరావు, శివనాగిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయండి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: జిల్లాలో ఈనెల 26వ తేదీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా పెద్ద ఎత్తున నిర్వహించుకునేందుకు ఇప్పటినుండే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరే ట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, డిఎస్పి శ్రీనివాసరెడ్డిలతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గణతంత్ర దినోత్సవ వేడు కలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటినుండే ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కళాశాల మైదానాన్ని ఆకర్షణీయమైన రీతిలో తీర్చిదిద్దడంతో పాటు జాతీయ పతాక ఆవిష్కరణ, పరేడ్ మార్చ్ ఫాస్ట్ లో సాయుధ దళాలు, ఎన్ఎస్ఎస్, ఎన్సిసి కేడెట్లు, స్కౌట్లు తదితర కంటిజెంట్స్ అధికంగా ఉండేలా చర్యలు తీసుకో వాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. వేదిక, విఐపిలు, అధికారులు, ప్రజలు, విద్యా ర్థులు కూర్చు నేందుకు ఎండ తగలకుండా పెండాల్స్ సీటింగ్ ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆర్అండ్ బి, రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అత్యు త్తమ ప్రతిభ కనబరచిన ఐదు శాఖలకు రోలింగ్ షీట్‌లు బహుకరిస్తామన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికలను ముందుగానే ప్రచు రించి ప్రోటోకాల్ ప్రకారం అందరికీ పంపిణీ చేయాలని డిఆర్ఓను సూచించారు. డిఆర్ఓ రాము నాయక్, సిపిఓ వేణుగోపాల్, ఆర్అండ్‌బీ ఎస్ఇ శ్రీధర్ రెడ్డి, డిఆర్డిఎ పిడి శ్రీధర్ రెడ్డి, డ్వామా పీడీ జనార్దన్ రావు, డిఎంహెచ్ డా. వెంకట రమణ, డీఈఓ జనార్దన్ రెడ్డి, ఇతర జిల్లాధికారులు పాల్గొన్నారు.

సీఎం గారు.. ఇంటి స్థలాలు ఎక్కడ

విశాలాంధ్ర బ్యూరో – కర్నూలు : సీఎం గారు ఇంటిస్థలం ఎప్పుడు ఇస్తారని సీపీఐ నగర కార్యదర్శి ఎస్.రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు. మంగళవారం సీపీఐ కర్నూల్ నగర సమితి ఆధ్వర్యంలో ఐదోరోజు రిలేనిరాహారదీక్షలకు నగర కార్యవర్గ సభ్యులు సోమన్న అధ్యక్షత వహించారు. నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డి పూలమాలలు వేసి ప్రారంభించారు. అనంతరం దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నగరంలో ఉన్న నిరుపేదలకు రెండు సెంట్లు ఇండ్ల స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణం కోసం రూ.5 లక్షల రాష్ట్ర ప్రభుత్వం కేటాయించాలని, ప్రభుత్వ స్థలాలలో పేదలు వేసుకున్న గుడిసెలకు తక్షణమే పట్టాలు మంజూరు చేసి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. నగరంలో రద్దీప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటుచేసి కర్నూల్ నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకు రెండవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ఏర్పాటు చేయాలన్నారు. పేద మధ్యతరగతి ప్రజలకు కరెంటు చార్జీల రేట్లు తగ్గించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేదల ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, టిడ్కో ఇళ్లను ఇందిరమ్మ ఇళ్లను తక్షణమే లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కామ్రేడ్ నాగరాజు, నగర కార్యవర్గ సభ్యులు ఈశ్వర్,బిసన్న నగర నాయకులు సత్యం, రాజేష్, భీమిరెడ్డి, శీను, రాముడు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గిడ్డమ్మ, శ్రావణిరెడ్డి నగర అధ్యక్ష కార్యదర్శులు నాగేంద్రమ్మ, భారతి, నాగేశమ్మ, శైలజ, సులోచనమ్మ, మునెమ్మ, రాముడు, కళాకారులు మాణిక్యం బద్రి శ్రీను, కరుణాకర్, కమలాకర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి శరత్, కుమార్ నగర అధ్యక్షుడు అభి, కార్యదర్శి అశోక్, వివిధ శాఖల కార్యదర్శులు మహిళలు అధిక సంఖ్యలో దీక్షలో పాల్గొన్నారు.

ఆయకట్టు రైతుల పంట పొలాలను కాపాడాలి

విశాలాంధ్ర –ఆస్పరి: మండల పరిధిలోనే వెంగళాయ దొడ్డి చెరువులో ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టి ఆయకట్టు రైతులు పంట పొలాలలో కాపాడాలని వెంగళాయ దొడ్డి చెరువు పరివాహక ప్రాంత పరిరక్షణ కమిటీ నాయకులు విరుపాక్షి, తొగలగల్ గ్రామ సర్పంచ్ ఆంజినయ్య, కైరుప్పల సర్పంచ్ కాసారం తిమ్మక్క తనయుడు మాజీ డైరెక్టర్ బి.టెక్ వీరభద్రి లు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బస్టాండ్ ముందు వెంగళాయ దొడ్డి చెరువు పరివాహక ప్రాంత పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంగళాయదొడ్డి చెరువు ఆయకట్టు కింద ఖరీఫ్ సీజన్లో వెయ్యి ఎకరాలకు, రబీ సీజన్లో 500 ఎకరాలకు సాగునీటిపారుదల కలదని, ఈ చెరువు మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో ఉందన్నారు. ఈ చెరువు కింద కైరుప్పల, కారుమంచి, దొడగొండ, కల్లపరి, డి.కోటకొండ, బైలుపత్తికొండ, యాటకల్లు, చెన్నంపల్లి గ్రామాల రైతులకు ఆయకట్టు భూములు ఉన్నాయన్నారు. ఈ చెరువులో సమృద్ధిగా నీళ్ళు ఉంటే చుట్టుపక్కల గ్రామాల రైతులకు వేల ఎకరాలకు వాళ్లు వేసుకున్న బోర్లకు సమృద్ధిగా భూగర్భ జలాలు ఉండడంవల్ల రైతులు పంటలు నష్టపోకుండా పండించుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం చెరువులో మరియు చుట్టుపక్కల భూములలో ఉన్న ఇసుకను కొంతమంది మధ్య దళారులు లక్షల రూపాయలు దండుకుంటున్నారని ఆరోపించారు. గ్రామంలో కొంతమంది రాజకీయ నాయకులు వ్యాపారులుగా, ఇసుక తోడేల్లుగా అవతారమెత్తి ఆదోని పట్టణం చుట్టుపక్కల ప్రాంతాలకు చెరువు ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారని వారు ఆరోపించారు. ఇసుక తరలిపోవడంతో ప్రధాన చెరువు కట్ట బలహీనపడటంతో పాటు చుట్టుపక్కల ఉన్న రైతుల బోర్లలో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీని కారణంగా ఆయకట్టు రైతులతో పాటు చుట్టుపక్కలున్న బోర్లు వేసుకున్న రైతులు వేలాది ఎకరాల పంటలు పండించుకోవడానికి ప్రమాదకరంగా మారిందన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు, చిన్న నీటిపారుదల శాఖ అధికారులు స్పందించాలని అన్ని గ్రామాల్లో ఇసుక తరలింపు నిషేధిస్తున్నట్లు దండోరా వేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వెంగళాయ దొడ్డి చెరువు పరివాహక ప్రాంత పరిరక్షణ కమిటీ నాయకులు, హమాలి సంఘం అధ్యక్షులు హనుమంతు, రామాంజనేయ, ఈరన్న, వెంకటేష్, చంద్ర, రంగప్ప, లాలు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో ప్రచారంపై ఫిర్యాదు

విశాలాంధ్ర – నందవరం: తమపై సోషల్ మీడియాలో అసత్యాలు ప్రచారం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ పుష్పావతి, టీడీపీ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు నాగరాజు గౌడ్ ఫిర్యాదు చేశారు. మంగళవారం వారు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసి మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి తమ కుటుంబం పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తుందని, కొంతమంది మాపై అసత్యాలు ప్రచారం చేసుకుంటూ, బురద రాజకీయాలు చేస్తున్నారన్నారు. గత వారం రోజులుగా గోనెగండ్ల ప్రాంతంలో అనవసరంగా పాత వీడియోలు సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నరని, వాటికి తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. అధిష్ఠానం, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఎవరికీ పదవులు ఇచ్చిన తమకు అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. రాజకీయాల్లో మమ్మల్ని ఇబ్బందులకు గురి చేయాలని, కొందరు నిత్యం అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరామన్నారు. ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయడం సిగ్గు చేటు కలిగిస్తుంద, ఇప్పటికైనా అసత్యాలకు అడ్డుకట్ట వేయాలని, లేదంటే జిల్లా అధికారులకు, సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

ఏ తప్పూ చేయలేదు, ఏ విచారణకైనా సిద్ధం

విశాలాంధ్ర – పెద్దకడబూరు : మండల పరిధిలోని హులికన్వి గ్రామంలో పట్టాదారు పాసుపుస్తకాలు చేయిస్తానని, పంటల భీమా ఇప్పిస్తానని తలారి డబ్బులు వసూలు చేసినట్లు రైతులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై తలారి తిక్కయ్యను మంగళవారం విచారణ నిమిత్తం ఆర్ఐ జెర్మియా ముందు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒక్క రైతు నుంచి డబ్బులు తీసుకోలేదని, ఏ విచారణకైనా సిద్ధమని, తనపై గిట్టని వారే కుట్రతో ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు.

జాతీయ స్థాయిలో సెపక్‌తక్రా సెలక్షన్స్

విశాలాంధ్ర–ఆలూరు : జాతీయస్థాయి సెపక్ తక్రా కోచింగ్ క్యాంపు కర్నూలు జిల్లా ఆలూరు లో పది రోజులపాటు జరుగుతున్న, క్యాంపుకు హాజరైన జిల్లా డిఎస్ఓ భూపతి రావు హాజరై క్రీడాకారులను పరిచయం చేసి, ఆంధ్రప్రదేశ్‌కు మంచి గుర్తింపు తీసుకురావాలని కీటకారులను ఉద్దేశించి ప్రసంగించాడు. వ్యాయామ ఉపాధ్యాయులు పిడి కవిరాజ్, సులోచన, చినబాబు, పీఈటీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ బ్రెయిలీ దినోత్సవానికి ఎంపీకి ఆహ్వానం

విశాలాంధ్ర – కర్నూలు సిటీ: కర్నూలు నగరంలో ఈ నెల 11న నిర్వహించే ప్రపంచ బ్రెయిలీ దినోత్సవ కార్యక్రమానికి కర్నూలు ఎంపి బస్తిపాటి నాగరాజును అంధుల సమైక్య ఆహ్వానించింది. అంధుల సమైక్య జిల్లా అధ్యక్షులు పుష్ప రాజు ఆధ్వర్యంలో నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీనాగరాజును కలిసిన సమైక్య నాయకులు బ్రెయిలీ దినోత్సవంలో పాల్గొనాలని కోరారు. అంధులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సమైఖ్య నాయకులు ఎంపీ దృష్టికి తీసుకురాగా, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

అక్రమ రిజిస్ట్రేషన్‌లో ఐదుగురికి రిమాండ్..

విశాలాంధ్ర – ఆదోని క్రైం: ఆదోని మండగిరి పంచాయతీలోని సర్వే నంబర్ 321- ఏలో 6.51 ఎకరాల భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ కేసులో ఐదు మందినీ అరెస్ట్ రిమాండ్కు తరలించినట్లు రెండవ పట్టణ సీఐ మోహన్ రావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసిన కేసులో సీనియర్ అసిస్టెంట్ ఈరన్న, జూనియర్ అసిస్టెంట్ రమేష్, డాక్యుమెంట్ రైటర్ మహబూబ్ బాషా, సాబీర్, సాక్షి వేసిన ఇలియాస్ లను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు రెండో పట్టణ సీఐ సూర్య మోహనరావు తెలిపారు. ఇంకో 5 మంది పరారీలో ఉన్నారు. సబ్ రిజిస్టర్ హాజీ మియా తో పాటు ప్రధాన నిందితులు ఇద్దరు, సాక్షి వేసిన మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రధాన నిందితుల కోసం ముమ్మర గాలింపు చర్యలు చేపట్టిన రెండో పట్టణ సీఐ తెలిపారు.

జేఏసీ క్యాలెండర్ ఆవిష్కరణ..

విశాలాంధ్ర – కల్లూరు: నవ్యాంధ్ర విద్యార్థి, యువజన జేఏసీ క్యాలెండర్‌ను పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి ఆవిష్కరించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యే గౌరు చరితరెడ్డి మాట్లాడుతూ ఓర్వకల్ మండలంలో ఏర్పాటు చేయబోయే పరిశ్రమలలో స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని వారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు ఏ అయ్య స్వామి, ఏపీ నిరుద్యోగుల ఫోరమ్ రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీరాములు, రాయలసీమ స్టూడెంట్ జేఏసీ అధ్యక్షులు కోనేటి వెంకటేశ్వర్లు, అడ్వకేట్ బి.నరసింహరాజు, దేశ పౌరు రాజన్న, పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

అద్దె చెల్లించకుంటే షాపులు తాళాలు వేస్తాం

విశాలాంధ్ర–ఆలూరు : మండల కేంద్రంలో ఇండోర్ స్టేడియం పరిధిలో ఉన్న 6 షాపులకు అద్దె బకాయిలు చెల్లించకుంటే దుకాణాలు తాళాలు చేస్తామని జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆఫీసర్ భూపతి అన్నారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ దుకాణాల సముదాయ వ్యాపారస్తులతో ఆయన మాట్లాడారు. 6 దుకాణాలకు సంబంధించి రూ.10 లక్షల వరకు అద్దె రావల్సి ఉందన్నారు. జిల్లా వారి ఆదేశాల మేరకు దుకాణదారులకు అద్దె చెల్లించాలని హెచ్చరించినట్లు చెప్పారు.

జీజీహెచ్‌లోని ఒల్డ్ గైనిక్ విభాగంలో హెచ్ఎంపీవీ వైరస్ విభాగం ఏర్పాటు

విశాలాంధ్ర – కర్నూలు వైద్యశాల: కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో హెచ్ఎంపీవీ వైరస్ రోగులకు ప్రత్యేకంగా పాత గైనిక్ విభాగంలో 20 పడకలతో అన్ని సదుపాయాలతో హెచ్ఎంపీవీ వార్డు ఏర్పాటు చేశారు. ఈ వార్డు ఏర్పాటు సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ వ్యాధి ప్రాణాంతకమైనది కాదని, ప్రజలు ఎవరు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన కమిటీ ఆరుగురు వైద్యులతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

పాఠశాల అభివృద్ధే లక్ష్యం

విశాలాంధ్ర – పెద్దకడబూరు: పాఠశాల అభివృద్ధే తన లక్ష్యమని ఉర్దూ పాఠశాల చైర్మన్ ఇర్ఫాన్ పటేల్, వైస్ చైర్మన్ ముఖ్తార్ అహ్మద్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలోని ఉర్దూ పాఠశాల విద్యార్థులకు పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో తాగునీటి పైపు లైను వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ పాఠశాలలో మరుగుదొడ్ల మురుగునీరు పారుదల లేక నీరు నిల్వ ఉండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీంతో తాము సొంత నిధులతో పైపు లైను ఏర్పాటు చేసి డ్రైనేజీ కాలువ వరకు పైపు లైను వేయడం జరిగిందన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన సర్పంచ్

విశాలాంధ్ర – పెద్దకడబూరు: మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ప్రధాన రహదారి వెంబడి జరుగుతున్న పారిశుధ్య పనులను మంగళవారం వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి, గ్రామ సర్పంచ్ రామాంజనేయులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రతే లక్ష్యంగా పంచాయతీ సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికే గ్రామంలోని లక్ష్మీ పేటలో డ్రైనేజీ పూడిక తీత పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. ప్రజలు తమ ఇళ్ల ముందు ఉన్న డ్రైనేజీల మీద ఉన్న బండలను తీసేందుకు సహకరిస్తే డ్రైనేజీలలో పూడిక తీసేందుకు సులభతరం అవుతుందన్నారు. తీసివేసిన పూడికను సంపద సృష్టి కేంద్రంకు తరలించాలని సూచించారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

విశాలాంధ్ర – ఆదోని రూరల్: అంగన్వాడీ సెంటర్లో పనిచేస్తున్నటువంటి టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర సమితి సభ్యులు గౌసియా బీ, పట్టణ గౌరవ అధ్యక్షులు టీ.వీరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్లను, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రాట్యూటీని తక్షణమే అమలు చేయాలని, సెంటర్ల అద్దెలు, వర్కర్ల గౌరవ వేతనాలు ప్రతి నెల 5వ తేదీ లోపు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ కు వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ప్రజా సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగి అనే అంశాన్ని తొలగించాలని, అంగన్వాడికి సంబంధించిన వివిధ యాప్‌లను ఒకే యాప్‌గా సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఈరమ్మ, శారద, గీతా దేవి, సరోజ, ప్రభావతి, కమల, విజయ, తదితరులు పాల్గొన్నారు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

విశాలాంధ్ర – కోసిగి: మండలం కొల్మాన్ పేట గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కిందింటి తిక్కయ్య సోమవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. స్థానిక టీడీపీ యువనాయకులు ఉప్పలపాటి అర్జున్ ద్వారా విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి మృతుని కుటుంబానికి మట్టి ఖర్చులు నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయాన్ని పంపించారు. ఆ కుటుంబానికి నియోజకవర్గ ఇన్చార్జి సానుభూతి తెలిపి సంతాపం వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇన్చార్జి పంపిన ఆర్థిక సహాయాన్ని స్థానిక యువ నాయకులు ఉప్పలపాటి అర్జున్ మృతుని కుటుంబానికి అందచేశారు. మృతుని కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపారు. ఉప్పలపాటి అర్జున్ మాట్లాడుతూ నియోజక ఇన్చార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి గారితో మాట్లాడి చంద్రన్న బీమా, టీడీపీ సభ్యత్వం తీసుకున్నందుకు పార్టీ తరుపున సహజ మరణం కింద బీమా ఇప్పించడం జరుగుతుందని తెలిపారు. వంధగల్లు నరసింహులు, మదిరి చిన్న ఆంజనేయ, రాయచూరు రామకృష్ణ పాల్గొన్నారు.

జీఎన్ఎం నర్సింగ్ పరీక్ష హాల్ తనిఖీ

విశాలాంధ్ర – కర్నూలు వైద్యశాల: కర్నూల్ ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో జీఎన్ఎమ్ నర్సింగ్ పరీక్ష కేంద్రాలను హాస్పిటల్ పర్యవేక్షకులు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదు పరీక్ష కేంద్రాల వద్ద ఓ మెడికల్ ఆఫీసర్‌ను, అబ్జర్వర్‌లను నియమించి కాపీలు జరగకుండా పలు జాగ్రత్తలు తీసుకున్నామని విలేకరులకు తెలిపారు. మాస్ కాపీయింగ్ జరిగితే వెంటనే వారి దగ్గర ఉన్న సమాధాన పత్రాన్ని తీసుకొని బయటకు పంపించాలని ఇన్విజిలేటర్స్ కు చెప్పారు.

లింగ నిర్ధారణ పరీక్షల చట్టా రీత్యా నేరం

విశాలాంధ్ర–కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక కేవీఆర్ గవర్నమెంట్ మహిళా డిగ్రీ కాలేజీ నందు ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అధితులుగా జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు ఎం.వెంకట హరినాథ్ హాజరయ్యారు. జడ్జి వెంకటలీల శేషాద్రి మాట్లాడుతూ పీసీ అండ్ పిడి యాక్ట్ ప్రకారం గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు, బ్రూణ హత్యలు చట్టరీత్య నేరమని తెలిపారు. ఏ స్కాన్ సెంటర్ అయినా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే వారికీ శిక్ష తప్పదని తెలిపారు.మహిళల హక్కులు రక్షణ మరియు నిబంధనలను వివరించారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్.15100, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్. 1098 తదితర అంశాలను గురించి వివరించారు. శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ శాశ్వత లోక్ అదాలత్ గురించి వివరించారు. జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి. శాంతి మాట్లాడుతూ డాక్టర్స్ ఎవరుకూడా లింగ నిర్ధారణ చేయకూడదని తెలిపారు.డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం కన్సల్టెంట్ మరియు న్యాయవాది సుమలత ఈ యాక్ట్ పై పేపర్ ప్రజన్ టేషను ఇచ్చారు. అనంతరం శిశు లింగ నిర్ధారణ వ్యతిరేక పతిజ్ఞ ను నిర్వహించారు. ఈ సమావేశంలో కేవిర్ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ దేవిక రాణి, ఎన్ఓ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు, డిప్యూటీ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పాల్గొన్నారు.

సామాజిక స్పృహ కలిగిన భవిష్యత్ పౌరులు విద్యార్థులు

విశాలాంధ్ర – ఎమ్మిగనూరు: లిటిల్ ప్లానెట్ స్కూల్ యాజమాన్యం మణి మాధురి ఆధ్వర్యంలో స్కూల్ విద్యార్థులచే పట్టణంలోని శ్రీనివాస సర్కిల్, మాచాని సోమప్ప సర్కిల్, వివిధ సర్కిలలో సోషల్ అవేర్నెస్ ప్రోగ్రామ్స్, మొబైల్స్ ఎక్కువ వాడడం వల్ల నష్టాలు, మొబైల్‌ను మితంగా ఏ విధంగా వాడాలి, హెల్మెట్, లైసెన్స్ లేకుండా డ్రైవింగ్ చేస్తే కలిగే నష్టాలు రాష్ డ్రైవింగ్ చేస్తే కలిగే నష్టాలు,ఆన్లైన్ గేమ్స్ బెట్టింగ్ ద్వారా నష్టాలు, మత్తు పదార్థాలకు బానిసైతే కలిగే నష్టాలు, పౌరుల యొక్క సామాజిక బాధ్యతలు గురించి కార్యక్రమాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా మల్లెల గ్రూప్స్ అధినేత, సామాజిక సేవకులు డా.మల్లెల ఆల్ ఫ్రెడ్ రాజు, టౌన్ ఎస్ఐ పాల్గొన్నారు. డా.మల్లెల ఆల్ఫ్రెడ్ రాజు మాట్లాడుతూ లిటిల్ ప్లానెట్ స్కూల్ యాజమాన్యం మని మాధురి, వారి బృందానికి ఆ స్కూల్ విద్యార్థులకు ప్రత్యేకమైన ధన్యవాదాలు అభినందనలు తెలిపారు. అంతేకాక లిటిల్ ప్లానెట్ స్కూల్ విద్యార్థులు ఇలాంటి అద్భుతమైన మంచి సోషల్ అవేర్నెస్ కార్యక్రమాలు చేయడం చాలా అభినందనీయమన్నారు.

గురుకుల ఘటనపై విచారణ చేపట్టిన అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్

విశాలాంధ్ర – ఎమ్మిగనూరు: మండల పరిధిలోని, బనవాసి ఏపీ గురుకుల కళాశాలలో విద్యార్థినిపై లైంగిక వేధింపుల ఘటనపై మంగళవారం అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ కళ్యాణి విచారణ చేపట్టారు. ముందుగా విద్యార్థినులతో కలసి మాట్లాడి పూర్తి వివరాలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినులు తెలిపిన సమస్యలపై వారి పాతబడిన డార్మెట్రీ, బాత్ రూమ్‌లను, వారి తరగతి గదులను, ఘటన జరిగిన లైబ్రేరియన్ గదిని, స్వయంగా వెళ్ళి పరిశీలించారు. అనంతరం ప్రిన్సిపల్, అధ్యాపకులతో సమావేశం ఏర్పాటు చేసి, ఘటన విషయం పై పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయకుండా ఎందుకు నిర్లక్ష్యం వహించారని, విద్యార్థినుల సమస్యలు పట్ల నిర్లక్ష్య ధోరణి ఉండరాదనీ హెచ్చరించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ కళ్యాణి మీడియా తో మాట్లాడుతూ మొన్న జరిగిన ఘటనపై సీఎస్ ఆదేశాలు మేరకు బనవాసి ఏపీ గురుకుల కళాశాలకు విచారణ నిమిత్తం వచ్చానని, జరిగిన ఘటనపై విద్యార్థినులతోనూ కలసి ప్రశాంత వాతావరణంలో అన్ని వివరాలను అడిగి తెలుసుకున్నానని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బందితో ను సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థినిలు సమస్యలు తమ దృష్టికి తీసుకుని వచ్చినప్పుడు ఉన్నతాధికారులకు చెప్పకుండా నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించినట్లు తెలిపారు. విచారణ చేసిన అంశంపై తయారు చేసిన నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని తెలిపారు.

ఏపీఆర్జేసీ పూర్వపు ప్రిన్సిపాల్ చేసిన అవినీతిపై విచారణ చేపట్టాలి

విశాలాంధ్ర – ఎమ్మిగనూరు: ఏపీఆర్జేసి గత ప్రిన్సిపల్ చేసిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టాలని విద్యార్థి సంఘాల నాయకులు విజేంద్ర, శేఖర్, మహేంద్ర బాబు, ఉదయ్, వీరేష్ యాదవ్, సురేంద్ర బాబు, ఉసెన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఏపీఆర్జేసి కళాశాలకు విద్యార్థినిపై సంఘటనపై విచారణకు వచ్చిన అసిస్టెంట్ కలెక్టర్ కళ్యాణికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పదిహేను సంవత్సరాల నుండి ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తూ కళాశాలలో విద్యార్థులకు ఏ ఒక్క సంఘటన జరిగినా బయటకు పొక్కకుండా చూసుకుంటున్నాం న్నారు. కళాశాలకు సంబంధించిన నిధులు గోల్మాల్ చేసి అక్రమాలకు పాల్పడిన ప్రిన్సిపాల్‌పై ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. గురుకుల కళాశాల విద్యార్థుల హాస్టల్లో అనేక సమస్యలు ఉన్నా, వర్షాలు వస్తే నిద్రలేని రాత్రులు గడపాల్సిన పరిస్థితి విద్యార్థులు ఉన్నారన్నారన్నారు. తక్షణమే విద్యార్థులకు నూతన వసతి గృహాలను ఏర్పాటు చేసి విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి విద్యార్థులకు రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు నరసింహ రెడ్డి, ఖాదర్, రామకృష్ణ, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటిక స్థలం పరిశీలన

విశాలాంధ్ర – ఓర్వకల్లు: మండల పరిధిలోని నన్నూరు గ్రామంలో ముస్లిం మైనారిటీ బీసీ, ఎస్సీ కులకు స్మశాన వాటిక కోసం స్థలాన్ని మండల తహశీల్దార్ విద్యాసాగర్ మంగళవారం పరిశీలించారు. బిసి, మైనారిటీ, ఎస్సీలకు స్మశాన వాటిక స్థలం తక్కువ ఉందని గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు, మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. దీంతో మండల సర్వేర్ శంకర్ మాణిక్యం, గ్రామ వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, టిడిపి జిల్లా కార్యవర్గ సభ్యులు బి.విశ్వేశ్వర్ రెడ్డి, బీసీ సెల్ తలారి విజయుడు, మాజీ మండల కోఅప్షన్ మెంబర్ షాంశుద్దున్, నంద్యాల జిల్లా టీడీపీ మైనారిటీ ఉపాధ్యక్షులు కాజామియ్య, మాజీ సింగిల్ విండో ప్రెసిడెంట్ ఎద్దుల చంద్రశేఖర్ రెడ్డి, షేర్వాణి సర్దార్ ఖాన్, కటికే హాసన్ హుసేన్సర్కార్, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల మైదానంలోకి డ్రైనేజీ నీరు

విశాలాంధ్ర–గోనెగండ్ల: జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానం లోనికి ప్రహరీ గోడకు అనుకొని ఉన్న అతిపెద్ద డ్రైనేజీ నీటిలో చెత్త చెదారం పేరుకోపోయి గత మూడు రోజులుగా ప్రహరీ గోడ కింద భాగం నుంచి నీరు మైదానంలోకి ప్రవేశించడంతో పాఠశాల మైదానంలో దుర్వాసన వస్తుందనే సమాచారంతో జనసేన నియోజక వర్గ మీడియా ఇంఛార్జి గానిగ బాషా గోనెగండ్ల మండల నాయకులు మాలిక్, ఖాసిం సాహెబ్ డ్రైనేజీ మురుగు నీరు ఏర్పడిన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాఠశాల మైదానంలో తెల్లవారుజామునే వ్యాయామం కోసం వృద్ధులు, యువకులు, మహిళలతో పాటు పాఠశాల సమయంలో విద్యార్థులు క్రీడలు ఆడుకోవడానికి అనువైన విశాల మైదానంలోకి డ్రైనేజీ నీరు రావడంతో అందరికీ చాలా ఇబ్బందికరంగా మారిందన్నారు. ప్రహరీగోడ చుట్టూ అనుకొని ఉన్నా డ్రైనేజీ కాల్వల్లో పేరుకుపోయిన చెత్త చెదారం తొలగించడానికి ఆస్కారం లేకుండా పోవడంతోనే మురుగునీరు లోపలికి ప్రవేశించడం జరిగిందని జనసేన నాయకులు ఆరోపించారు. ఎప్పటికపుడు డ్రైనేజీ కాల్వల్లో ఏర్పడిన చెత్తను తొలగించేలా పంచాయితీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఇలాంటివి ఉత్పనం కాకుండా ఉండేలా మండల ఉన్నత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు, ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సుబాన్, ఉత్తేజ్, ఉస్మాన్, పాల్గొన్నారు.

HINDUJA HOUSING FINANCE

హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
CIN U65922TN2015PLC10093, www.hindujahousingfinanace.com
కార్పొరేట్ కార్యాలయం: 167-169, 2వ అంతస్తు, అన్నాసలై, సైదాపేట్, చెన్నై-600 015,
బ్రాంచ్ కార్యాలయం: 51/12-12-ఇ3, 2వ అంతస్తు, తిలక్‌నగర్, రెవిన్యూ కాలనీ, వార్డ్ సం.51, విద్యుత్ భవన్ ఎదుట, ఆంధ్రాబ్యాంక్ పైన, కర్నూలు-518002.

అనుబంధం-4 స్వాధీనత ప్రకటన (స్థిర ఆస్తి కొరకు)

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా.. హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ అధీకృత అధికారిగా దిగువ సంతకందారు సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (యాక్ట్ నం.54 ఆఫ్ 2002) మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002, నిబంధన 3తో చదివే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించి నోటీసులో ప్రస్తావించిన బకాయి మొత్తాన్ని సదరు నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసిందిగా కింద ప్రస్తావించిన రుణగ్రహీత(లు) / హామీదారు(లు) లకు పిలుపు నిస్తూ అధీకృత అధికారి ద్వారా డిమాండ్ నోటీసు(లు) జారీ చేయడమైనది. రుణగ్రహీత/లు/హామీదారు/లు బకాయి మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో విఫలమైనందున సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క నిబంధన 8తో చదివే చట్టం యొక్క సెక్షన్ 13 లోని ఉప సెక్షన్ (4) కింద అతనికి సంక్రమించిన అధికారాలను వినియోగించి ఈ కింద వివరించబడిన ఆస్తులను దిగువ సంతకందారు **భౌతికంగా స్వాధీనం** చేసుకున్నట్లు రుణగ్రహీత(లు) / హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమైనది.

వ. సం.	అప్లికేషన్ సం. రుణగ్రహీత(లు)/హామీదారు(లు) పేరు మరియు చిరునామా	ఈ తేదీ నాటికి మొత్తం బకాయి	డిమాండ్ నోటీసు తేదీ	భౌతిక స్వాధీనత తేదీ
1	1. శ్రీ ఆర్ మాల మద్దిలేటి తండ్రి శ్రీ మాదన్న, ...రుణగ్రహీత, 2. శ్రీమతి ఆర్ మాల కుమారి, ...సహ రుణగ్రహీత. ఇద్దరూ నివసించునది: ఆర్/ఓ. డోర్ నెం.1-15, గోవర్ధనగిరి, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్-518216. ఇంకా ఇక్కడ: ఇంటి నెం. 83/23, వార్డ్ నెం.83, ప్లాట్ నెం.715 పైకి, ప్రస్తుతం కర్నూలు జిల్లా, మున్సిపల్ కార్పొరేషన్ పరిమితుల్లో, కల్లూరు మండలం, షరీన్ నగర్ లో ఉంది. రుణఖాతా సంఖ్య: AP/KUR/KURL/A000000609	28/05/2024 & రూ.8,38,538/- (ఎనిమిది లక్షల ముప్పై ఎనిమిది వేల ఐదువందల ముప్పై ఎనిమిది రూపాయలు మాత్రమే)	16/02/2024	06.01.2025
	హామీగా పెట్టిన ఆస్తి వివరాలు (స్థిర ఆస్తి) : కర్నూలు జిల్లా, ఎస్.ఆర్.ఓ కల్లూరు & ఆర్ఓ. కర్నూలు, ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధి, కల్లూరు మండలం, షరీన్ నగర్‌లో ఉన్న సర్వే నం.546/1 పైకి వార్డ్ నం.83, నందు ప్లాట్ నం.715పై 52.77 చదరపు గజాల కొలతతో ఉన్న హౌస్ నం.83/23 యొక్క ఆస్తి మొత్తంగా. హద్దులు: తూర్పు: ఇదే ప్లాట్‌లో మిగిలిన స్థలం, పడమర: బాషా స్థలం, ఉత్తరం: ఇతరుల స్థలం, దక్షిణం: 30' రోడ్డు.			
2	1. శ్రీ పేడిగ రామకృష్ణ గౌడ్, తండ్రి పుల్లయ్య గౌడ్ ...రుణగ్రహీత, 2. శ్రీమతి పేడిగ పుల్లమ్మ, ...సహ రుణగ్రహీత. ఇద్దరూ నివసించునది: ఆర్/ఓ. హెచ్.నం: 201/53, కొత్త బిల్డింగ్, సేకునాల గ్రామం, ఓర్వకల్ మండలం, కర్నూలు జిల్లా, ఎపి-518010. ఇంకా ఇక్కడ: ఆర్/ఓ. హెచ్.నం. 7-53, వార్డ్ నం.7, బి.సి. కాలనీ, సెకునాల గ్రామం, ఓర్వకల్ మండలం, కర్నూలు జిల్లా, ఆంధ్రప్రదేశ్-518101. రుణఖాతా సంఖ్య: AP/KUR/KURL/A000000645 AND CO/CPC/CPOF/A000000257.	28/05/2024 & రూ.10,92,267/- (పది లక్షల తొంభై రెండు వేల రెండువందల అరవై ఏడు రూపాయలు మాత్రమే)	16/02/2024	04.01.2025
	హామీగా పెట్టిన ఆస్తి వివరాలు (స్థిర ఆస్తి) : కర్నూలు జిల్లా, ఎస్.ఆర్. ఓర్వకల్ & ఆర్ఓ. కర్నూలు, ఓర్వకల్ మండలం, శకునాల గ్రామం & గ్రామ పంచాయతీ, వార్డ్ నం.7లో ఉన్న సర్వే నం.727/1లో 145.2 చదరపు గజాలు కొలతలో హెచ్.నం.7-53 మొత్తంగా. హద్దులు: 1306.8 ఎస్ఎఫ్టి. ఆర్‌సిసి హద్దులు: తూర్పు: బి. మద్దిలేటి ఇల్లు, పడమర: జి. మద్దిలేటి ఇల్లు, ఉత్తరం: రాస్తా, దక్షిణం: గొల్ల నాగరత్నమ్మ ఇల్లు.			

ఈ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు నిర్వహించరాదని, ఈ ఆస్తితో ఏదేని లావాదేవీలు పైన పేర్కొన్న బకాయి మొత్తం మరియు దానిపై వడ్డీకి గాను హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ చార్జికి లోబడి వుంటాయని ప్రత్యేకించి రుణగ్రహీత/లు/ హామీదారు/లు మరియు సాధారణ ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

ప్రదేశము : కర్నూలు, తేదీ : 08-01-2025 సం/- (అధీకృత అధికారి), హిందూజా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 08, జనవరి 2025

సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర - బనగానపల్లె : సంక్రాంతి పండుగ సందర్భంగా బనగానపల్లె పట్టణ ప్రజల ఆనందం మహిళల ఉత్సాహం కోసం సంక్రాంతి ముగ్గుల పోటీలను ఏపీ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి బీసీ ఇందిర ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. బనగానపల్లె పట్టణంలోని ప్రభుత్వ స్కూల్ గ్రౌండ్ నందు ముగ్గుల పోటీలు నేడు నిర్వహించడం జరుగుతుంది. ఈ మేరకు మంగళవారం నాడు ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్ నందు ముగ్గుల పోటీల ప్రాంతాన్ని ఏపీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిర, ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, విశ్రాంత ఎంఈఓ పక్కీరా రెడ్డి లు కలిసి పరిశీలించారు. ముగ్గుల పోటీ ప్రాంతాన్ని గ్రామీణ ప్రాంతం వాతావరణం తలపించేలా ఏర్పాట్లు చేయడం జరిగింది. నేటి ఉదయం 9 గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభించడం జరుగుతుందని ఏపీ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిర చెప్పారు. విజేతలైన వారికి మొదటి బహుమతి వాషింగ్ మిషన్, రెండో బహుమతి జిగ్- జాగ్ కుట్టు మిషన్, మూడో బహుమతి కూలర్, నాలుగో బహుమతి కిచెన్ స్టోరేజ్ బాక్స్, ఐదో బహుమతి టేబుల్ ఫ్యాన్ అందించడం జరుగుతుందని బీసీ ఇందిర తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణ నాయక్, టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకోవాలని రామకృష్ణ విద్యా సంస్థల అధినేత డాక్టర్ రామకృష్ణారెడ్డి అన్నారు. పట్టణం రామకృష్ణ డిగ్రీ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని యువజన సర్వీసుల శాఖ - సెట్కూరు ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ డా.జి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ స్వామి వివేకానంద ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ ఔన్నత్యాన్ని, గొప్పతనాన్ని చాటి చెప్పారని, వారి జీవితాన్ని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి సోమశివారెడ్డి, శాంతినికేతన్ స్కూల్ కరెస్పాండంట్ సుధాకర్, కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బయ్య, నంద్యాల రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ పర్ల దస్తగిరి తదితరులు మాట్లాడుతూ వివేకానంద రామకృష్ణ మఠాన్ని స్థాపించి ప్రజలను ఆధ్యాత్మిక చింతన పెంపొందించేందుకు కృషి చేసారని, ముఖ్యంగా యువత ఎలా ఉండాలో,ఎలా వృద్ధిలోకి రావాలో చేసిన సూచనలు, సూక్తులను యువత ఆచరణ లో పెట్టి విజయం సాధించాలని కోరారు. స్వామి వివేకానంద సేవలకు గుర్తుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సంవత్సరం జనవరి 12ను జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకొంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తాయని, అందులో భాగంగానే నంద్యాల జిల్లాలో 15 నుంచి 29 సంవత్సరాల యువతకు వివిధ అంశాలలో పోటీలు నిర్వహించడ మైనదని తెలిపారు. వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, క్విజ్ పోటీలలో మొదటి మూడు స్థానాలలో నిలిచిన విజేతలకు మెమెంటో, ప్రశంసా పత్రాలు బహూక రించారు. ఈ కార్యక్రమంలో సెట్కూరు కార్యాలయ సూపరింటెండెంట్ శ్యాంబాబు, కళాశాల లెక్టరర్ లలితా సరస్వతి, రెడ్ క్రాస్ ప్రతినిధి ఉస్మాన్ బాష పాల్గొన్నారు.

విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె: పదో తరగతి విద్యార్థులు పరీక్షలో ఒత్తిడికి గురి కాకుండా మంచి ఉత్తీర్ణత సాధించి వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖకు మంచి పేరు తీసుకురావాలనిజిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ముస్తాక్ అహ్మద్ అన్నారు. మంగళవారం నాడు పట్టణంలోని ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహం నందు వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ డోన్ డివిజనల్ వారి ఆధ్వర్యంలో పదవ తరగతి వసతి గృహ విద్యార్థులకు ప్రేరణ మరియు శిక్షణ తరగతులు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించాలని క్రమశిక్షణ, పట్టుదలతో చదివి పాఠశాలకు తల్లిదండ్రులకు ప్రభుత్వ సంక్షేమ శాఖకు మంచి పేరు తీసుకురావాలి ఆయన ఆకాంక్షించారు. డోన్ డివిజన్లో ఉన్నటువంటి విద్యార్థులకు శిక్షణ కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మోటివేటర్ నరేష్,అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ ఓబులేసు, ఉపాధ్యాయులు, వసతి గృహ అధికారులు నాగేంద్ర, విద్యావతి, చైతన్య లక్ష్మి, మునిరాజు, వేణుగోపాల్, మధు, మేరీ, ఇక్బాల్, వెంకన్న గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన పలువురు ప్రముఖులు

విశాలాంధ్ర - బనగానపల్లె : బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ జి.నర్సారెడ్డి, అటవీ శాఖ అధికారులు, మద్దిలేటి స్వామి ఆలయ పండితులు, ఎంపీడీవో రమణ, ఈఓఆర్డి బొమ్మిరెడ్డి సతీష్ కుమార్ రెడ్డి, ఏవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పక్షపాతం లేకుండా పారదర్శకంగా అందించాం

విశాలాంధ్ర - జిల్లా పరిషత్ కర్నూలు: అందరి సహాయ, సహ కారాలతో, ఆధరాభిమా నాలతో, రాష్ట్రములోనే ఎంతో ప్రాముఖ్యత కలిగిన కర్నూలు జిల్లా ప్రజా పరిషత్తు అధ్యక్షులుగా జనవరి 1, 2022న పదవీ బాధ్యతలు చేపట్టి, నేటికి మూడు సంవత్సరములు పూర్తి అయిందని కర్నూలు జిల్లా ప్రజా పరిషత్తు అధ్యక్షులుగా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి నేటి వరకు అత్యంత పారదర్శకంగా, అవినీతికి, ఆశ్రిత పక్షపాతమునకు చోటివ్వకుండా, స్వచ్ఛమైన పాలన అందించడం ద్వారా తమ పై పెద్దలు పెట్టుకున్న విశ్వాసానికి, నమ్మకానికి ఏ మాత్రం వమ్ము చేయకుండగ, జిల్లా ప్రజా పరిషత్తు ద్వారా పరిపాలన సాగించామని సవినయంగా తెలుపుతున్నామని జిల్లా పరిషత్ చైర్మన్ పాపిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా జిల్లాపరిషత్ లోని ఆయన ఛాంబర్ లో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. చైర్మన్ పాపిరెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో ఉన్నతమైన ఆలోచన ఆచరణ తో మూడేళ్ళ పాలన విజయవంతంగా సాధ్యమైంద న్నారు. గూడూరు జెడ్పీటీసి మౌలాలి, జూపాడు బంగ్లా జెడ్పీటిసి జగదీశ్వరెడ్డి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ..

విశాలాంధ్ర- డోన్: డోన్ పట్టణంలో సినీ హీరో ఎన్టీఆర్ 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. మంగళవారం డోన్ పట్టణం ముకేశ్వర ఆలయం ఆవరణలో ఎన్టీఆర్ సేవాసమితి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ఆఫీసు నుంచి వచ్చిన క్యాలెండర్లను డోన్ ఎన్టీఆర్ సేవా సమితి అధ్యక్షులు కలచట్ల చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కె.రంగారెడ్డి, కోశాధికారి విజయ్ కుమార్ నాయుడు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ సంక్రాంతికి వస్తున్న సంక్రాంతి హీరో మా బాలయ్య బాబు నటించిన డాక్ మహారాజ్, మెగా ఫ్యామిలీ నుంచి రాంచరణ్ నటించిన గేమ్ చేంజర్ చిత్రాలు ఘన విజయం సాధించబోతున్నా యన్నారు. ప్యావిలి సురేష్ బాబు, మిద్దపల్లి తిమ్మరాజు, తారకరామ నగర్ వెంకటే, దేవర బండ వెంకట రాముడు, కింగ్ హెయిర్ స్టైల్ అంజి, వెంకట్ నాయన పల్లి అశోక్, కమలాపురం కృష్ణ, ధర్మారం సుధాకర్, సంతోష్, కృష్ణలు పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీ, క్యాలెండర్‌ల ఆవిష్కరణ

విశాలాంధ్ర - హెరాళగుంద: మండల విద్యా శాఖ అధికారి-1 టీ.సత్య నారాయణ, మండల విద్యాశాఖ అధికారి-2 జగన్నాథం ఆధ్వర్యంలో మంగళవారం ఎస్టీయూ డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు వై వెంకటేష్, కే శరణప్ప, అలాగే సీనియర్ నాయకులు, జే.రమేశ్, ఎస్ పోతరాజు, జి దొడ్డబసప్ప, గోపాల్, బీటీ ఖలందర్, ఎం.ధనుంజయ, కె.హనుమంతప్ప, లక్ష్మీ రెడ్డి, మూసా, శేఖరప్ప, అంజు నాయక్, కె.మంజుల, ఉపాధ్యాయులు, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు

మండలాల నూతన కమిటీలు ఎన్నిక

విశాలాంధ్ర - ఆదోని రూరల్: బీజేపీ ఆదోని నియోజకవర్గాన్ని ఐదు మండలాలుగా విభజించి, బిజెపి ఎన్నికల సహాధికారి దేశాయి చంద్రన్న ఆధ్వర్యంలో నూతన కమిటీలను ఏకగ్రీవంగా మండల కమిటీలను ఎన్నుకోవడం జరిగింది. బిజెపి సంస్థ గదా పటిష్టత కొరకు ప్రతి 50 బూతులకు ఒక మండలా లుగా విభజించే కమిటీలను ఎన్నుకోవాలని, భాజపా కేంద్ర సమితి ప్రకటించడంతో ఆదోని నియోజకవర్గం జరిగిందని దేశాయి చంద్రన్న తెలిపారు. ఆదోని టౌన్ నార్త్ మండల అధ్యక్షునిగా బోయ మహాదేవ, టౌన్ సెంట్రల్ మండల అధ్యక్షునిగా తోవి నాగార్జున, రూరల్ పెద్ద తుంబలం మండల అధ్యక్షునిగా కురువ వేణుగోపాల్, రూరల్ సదాపురం మండల అధ్యక్షునిగా బోయ ఉషా రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని మీడియాకు తెలిపారు. టౌన్ సౌత్ మండల అధ్యక్ష ఎన్నిక నియామకం కొన్ని అనివార్య కారణాలవల్ల ఎన్నుకోలేక పోయామన్నారు. వాజపా పార్టీపై మక్కువ ఉంటూ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నియమ నిబంధనాలను అనుసరిస్తున్న నాయకత్వాన్ని మండలల అధ్యక్షులుగా ఎన్ని కోవడం జరిగిందని గుర్తు చేశారు. మండలాల అధ్యక్షులుగా ఎన్నికైన నాయకత్వం ఆయా గ్రామాల్లో శాఖలు ఏర్పాటు చేసి భాజపా పార్టీ బలోపేతం కోసం కృషిచేసి సూచించారు. హిందూ ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి భారతీయునిపై ఉందన్నారు.

అంగన్‌వాడీ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి : ఏఐటీయూసీ

విశాలాంధ్ర-డోన్: అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్‌ను, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జాతీయ పిలుపుమేరకు మంగళవారం నల్లబ్యాడ్జీలతో డోన్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ముందు ఏఐటీయూసీ నియోజవర్గ కార్యదర్శి అబ్బాస్ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ డోన్ నియోజవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, అబ్బాస్, అంగన్వాడి జిల్లా కార్యదర్శి జులేఖ, జిల్లా ట్రెజరర్ ఎస్తేరమ్మ వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రంలో ఉన్న అంగన్వాడి వర్కర్స్ లక్ష మందికి పైగా రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చి 42 రోజులుగా సమ్మె నిర్వహించడం జరిగింద న్నారు. అప్పుడు అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం అంగన్వాడి వర్కర్లను వేతనాలు పెంచకుండా సమ్మె చేసినందుకు పోలీసులతో బెదిరించి కేసులు పెట్టి, పోలీసులు పెట్టి నిర్బంధించి అనేక ఇబ్బందులకు గురిచేసి ఒక్క రూపాయి కూడా వేతనం పెంచలేద న్నారు. ఆ సందర్భంలో ఎన్నికల బహిరంగ సభలో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు మాట్లాడుతూ నేను అధికారం లోకి వస్తే అంగన్వాడి వర్కర్స్ కు వేతనాలు పెంచడంతోపాటు అన్ని రకాలుగా ఆదుకుం టానని హామీ ఇచ్చారన్నారు. కానీ నేడు అధికారంలోకి వచ్చి 5 నెలలు దాటిన సంబం ధిత మంత్రులను రాష్ట్ర స్థాయి అధికారులను కలిసి విన్నవించిన అంగన్వాడి వర్కర్ల సమస్యల పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ డోన్ నియోజకవర్గ కార్యదర్శి స్వర్ణలత, నాయకురాలు జయలక్ష్మి, సుగుణ, విజయలక్ష్మి, ధనలక్ష్మి, నాగేంద్రమ్మ, రమణమ్మ, నిర్మల, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రి ఫరూక్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల : జనాభా ప్రాతిపదిక మేరకు నంద్యాల అర్బన్ మండల తహశీల్దార్ కార్యాల యాన్ని సత్వర రెవెన్యూ సర్వీసుల సౌలభ్యం కొరకు రెండు భాగాలుగా విభజించి రూరల్ మండల తహ శీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ అన్నారు. మంగళవారం స్థానిక అర్బన్ తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటైన రూరల్ మండల తహశీల్దార్ కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్ ఎండి ఫారుక్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా కేంద్రమైన తర్వాత జనాభా అధికమైన నేపథ్యంలో రూరల్, అర్బన్ మండలాలుగా విభజించి ప్రజలకు రెవెన్యూ సర్వీసులను సరళీతరం చేసేందుకు రూరల్ తహశీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కాంప్లెక్స్ నిర్మా ణం చేపట్టి అన్ని కార్యాలయాలు ఒకే ప్రదేశానికి తీసుకువచ్చి ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల మండలంలో 20 రెవెన్యూ గ్రామాలున్నాయని, భూ సంబంధిత దరఖాస్తులు, ఇతర సర్వీసులకు సంబంధించిన అంశాలు అధికంగా ఉన్న నేపథ్యంలో నంద్యాల రూరల్ మండల ఏర్పాటుకు నిమిత్తం ప్రభుత్వం అంగీకరించిందన్నారు. అనంతరం మండల కార్యాలయ ఆవరణలో మంత్రి, కలెక్టర్ మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు.

గుళదుర్తిలో పొలం పిలుస్తుంది కార్యక్రమం

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: మండల పరిధిలోని గుళదుర్తి గ్రామంలో పొలం పిలుస్తున్న కార్యక్రమాన్ని నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి నిరంజన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వరి పంట బీమా ప్రీమియం చెల్లించుటకు గడువు ఈ నెల 15 వరకు పొడిగించినట్లు తెలిపారు. సుమారుగా 7 వేల ఎకరాల పంట నమోదు కావాల్సి ఉందని తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారులు, వ్యవసాయ సిబ్బంది, గ్రామ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ బ్యాంక్ ఉద్యోగాల్లో సత్తా చాటిన శ్రీ గురురాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్

విశాలాంధ్ర బ్యూరో - నంద్యాల: పట్టణంలో ఉన్న శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ మరోసారి రాష్ట్ర స్థాయిలో తన సత్తాను చాటింది. గ్రామీణ బ్యాంకు రంగంలో 272 ఉద్యోగాల్లో సాధించి అగ్రగామిగా నిలిచినట్లు శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ చైర్మన్ డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి, డైరెక్టర్ పి.మౌలాలిరెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రీ గురు రాఘవేంద్ర బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. గ్రామీణ బ్యాంకింగ్ రంగంలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.దస్తగిరి రెడ్డి, పి.మౌలాలి రెడ్డి మాట్లాడుతూ 2024 గ్రామీణ బ్యాంకుల నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో తమ బ్యాంక్ కోచింగ్ సెంటర్ నుంచి అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వారికి అత్యుత్తమ శిక్షణతో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. మొత్తం 272మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారని తమ గురు రాఘవేంద్ర బ్యాంకు కోచింగ్ సెంటర్‌కు ఇది ఎంతో గర్వకారణంగా అభివర్ణించారు. ఐబీపీఎస్ ఆర్ఆర్బి పీఓలో 151, ఐబీపీఎస్ ఆర్ఆర్బి క్లర్క్ లో 121 ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. ఉద్యోగాలు పొందిన వారిని ప్రత్యేకంగా అభినందించారు. సరళమైన భాషలో బోధిస్తూ ఉద్యోగాలు పొందేలా చూడడమే తమ లక్ష్యం అని చెప్పారు. 35 ఏళ్లుగా బ్యాంకింగ్ కోచింగ్ సెంటర్ స్థాపించి ఎంతోమంది అభ్యర్థులు ఉద్యోగాలు పొందేలా శిక్షణ ఇచ్చామన్నారు.

కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వండి

విశాలాంధ్ర - వెలుగోడు: మండలం మోత్కూరు, మాధవరం గ్రామంలో మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ అధ్యక్షతన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం క్షేత్రస్థాయిలో మినుము, మొక్కజొన్న పైరును పరిశీలిం చారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ రబిలో సాగుచేసిన వివిధ పంటలు ఈ-పంట నందు నమోదు చేసుకోవాలని, పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంట వాతావరణ పరిస్థితుల్లో ఇన్పుట్ సబ్సిడీ పంట కొనుగోలు మరే ఇతర ప్రభుత్వ సబ్సిడీలు వర్తిస్తాయి.మినుము పంటలో సస్య రక్షణ చర్యలు చేపట్టాలి. ఈ కార్యక్రమంలో ఏఈఓ సుధారాణి వ్యవసాయ విస్తరణ సిబ్బంది నాగలింగం పలువురు రైతులు పాల్గొన్నారు. వెలుగోడు పట్టణంలోని స్థానిక స్టేట్ బ్యాంకు, ఏపీజీబీ, కెనరా, కేడీసీసీ బ్యాంకు మేనేజర్ లను కలిసి కౌలు రైతులకు పంట రుణాలు ఇవ్వాలని వెలుగోడు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, నంద్యాల జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రవీంద్ర కోరారు. వ్యవసాయ విస్తరణ సిబ్బంది అంజిత్ కుమార్ రెడ్డి, రామకృష్ణ, వెంకట శివ తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు తీర్చడానికే పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - చాగలమర్రి : రైతుల సమస్యలు తీర్చడానికే 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం ను నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రంగనేతాజీ తెలిపారు. మంగళవారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్లో అధిక చలి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి దీని ప్రభావం వలన శనగ పంటలో పూత రాలే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఈఓలు, గ్రామ వ్యవసాయ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

స్కీమ్ కార్మికులకు రూ.26 వేల వేతనం ఇవ్వాలి

విశాలాంధ్ర - నంది కొట్కూరు : దేశవ్యాప్తంగా ప్రభుత్వ సంక్షేమ పద కాలు ప్రజలకు చేర దీయడంలో కీలక పాత్ర వహిస్తున్న అంగన్వాడి, ఆశా, మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల వేత నాలు సుప్రీం కోర్ట్ ఆదే శాల మేరకు కనీస వేతనం రూ.26 వేలు పెంపుదల చేయాలనీ స్కీం వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్ బాబు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వి.రఘురామ్మూర్తి కోరారు. మంగళవారం పట్టణంలోని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ యూనియన్ అధ్యక్షురాలు రాణి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. స్కిం వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకట రమణ, కమల, కాత్యాయనీ, రాణి, లక్ష్మి, పుణ్యవతి పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇచ్చేంతవరకు పోరాటాలు చేస్తాం

విశాలాంధ్ర - నంద్యాల అర్బన్: ఇళ్ల స్థలాల సాధనకై ఈనెల 10వ తేదీన తహసిల్దార్ కార్యా లయం ఎదుట నిర్వహిం చే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, ఏఐ ఎస్ఎఫ్ ఏఐ వైఎఫ్ జిల్లా కార్యదర్శులు ధనుంజయుడు పిలుపునిచ్చారు. నంద్యాల పట్టణంలోని బాలాజీ కాంప్లెక్స్, ట్రాలీ ఆటో యూనియన్ సిపిఐ శాఖలలో మంగళవారం నిరు పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఇండ్లులేని నిరుపేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతంలో రెండు సెంట్లు తక్షణమే ఇవ్వాలని ఇంటి నిర్మాణం కోసం ఐదు లక్షలు ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి సురేష్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రిస్వామి, ఏఐవైఎఫ్ నంద్యాల పట్టణ కార్యదర్శి విష్ణులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఉచిత గుండె పరీక్షలు

విశాలాంధ్ర - ఆళ్లగడ్డ : స్థానిక కోర్టు సముదాయంలో కర్నూలు కిమ్స్ ఆస్పత్రి, ది అడ్వకేట్ బార్ అసోసియేషన్ వారి సౌజన్యంతో, ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూర్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత గుండె వైద్య శిబిరాన్ని మంగళవారం సీనియర్ సివిల్ జడ్జి శైలజ ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయవాదులకు ఉచితంగా ఈసీజీ, టుడి ఏకో, బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తులు కాశీభట్ల శివప్రసాదరావు, శివనాగిరెడ్డి, సీనియర్ న్యాయవాదులు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి సదస్సులు

విశాలాంధ్ర - చాగలమర్రి: గ్రామాల్లో భూ సమస్యలను పరిష్క రించేందుకు ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ రవికుమార్ సూచించారు. మండలంలోని చిన్నవంగలి గ్రామంలో సర్పంచ్ మౌలిభాష అధ్యక్షతన మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో పొలం సరి హద్దులు, గట్ల సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరిగే పని లేకుండా రెవెన్యూ అధికారులే గ్రామాలకు వచ్చి పరిష్క రించేందుకు ప్రభుత్వం సదస్సులు ఏర్పాటు చేస్తోందన్నారు. అనం తరం రైతుల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ అబ్దుల్ సత్తార్,వీఆర్ఓ సుబ్బరాయుడు, టిడిపి నాయకులు నరేంద్రా రెడ్డి, సంజీవరెడ్డి, అనీల్‌రెడ్డి, నర్సిరెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

బాలికలకు యంత్రాలపై అవగాహన

విశాలాంధ్ర- పాణ్యం: మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ల్యాబ్‌లలో మంగళవారం కస్తూరి పాఠశాల బాలికలు యంత్రాలను పరిశీలించారు బేటి పడావో, బేటి బచావో కార్యక్రమంలో భాగంగా పదవ తరగతి బాలికలకు ఫీల్డ్ ట్రిప్ కార్యక్రమం నిర్వహించినట్లు పాణ్యం కస్తూరిబా పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ కళ్యాణి తెలిపారు. ల్యాబ్‌లో బాలికలకు మెకానికల్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు జయశంకర్, పాండురంగ స్వామిలు బాలికలకు యంత్రాల పనితీరు వాటి ఉపయోగం విభాగాల పేర్లు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. పాఠశాల ఉపాధ్యాయినీలు అరుణకుమారి, ఎలిజిబెత్, రూప పాల్గొన్నారు.

హాని కలిగించే ప్లాస్టిక్‌ను వ్యతిరేకించాలి

విశాలాంధ్ర - బనగానపల్లె : పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ కవర్లను ప్రతి ఒక్కరు వ్యతిరేకిం చాలని డోన్ డిఎస్పి శ్రీని వాస్ అన్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణంలో పట్టణంలోని అన్ని రకాల వ్యాపారస్తులతొ స్టేనోప్లాస్టిక్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడడం వల్ల పర్యావరణాన్ని కలిగే అనర్థాల గురించి వివరించారు. ఈ నెల 15 నుంచి ప్లాస్టిక్ నిషేధానికి వ్యాపారస్తులు సహకరించాలన్నారు. సీఐ ప్రవీణ్ కుమార్, మంజునాథరెడ్డి, ఎస్సై దుగ్గిరెడ్డి రెడ్డిలు పాల్గొన్నారు.

అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్: అంగన్వాడీ సెంటర్లో పనిచేస్తున్నటువంటి టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర సమితి సభ్యులు గౌసియా బీ, పట్టణ గౌరవ అధ్యక్షులు టీ.వీరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టర్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్లను, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, గ్రాట్యూటీని తక్షణమే అమలు చేయాలని, సెంటర్ల అద్దెలు, వర్కర్ల గౌరవ వేతనాలు ప్రతి నెల 5వ తేదీ లోపు ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలన్నీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ కు వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ప్రజా సాధికార సర్వేలో ప్రభుత్వ ఉద్యోగి అనే అంశాన్ని తొలగించాలని, అంగన్వాడికి సంబంధించిన వివిధ యాప్‌లను ఒకే యాప్‌గా సవరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఈరమ్మ, శారద, గీతా దేవి, సరోజ, ప్రభావతి, కమల, విజయ, తదితరులు పాల్గొన్నారు